

దర్గాలో రాజ్‌ఠాకూర్ ప్రార్థనలు

గోదావరిఖని: కాజీపేటలోని ఖుబ్రపాషాసాహెబ్ హజరత్ మామక్ రబ్బానీ దర్గాలో డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాకూర్ మంగళవారం ప్రార్థనలు చేశారు.



వీఆర్‌ఏల క్రమబద్ధీకరణకు కసరత్తు

గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) వ్యవస్థను రద్దు చేస్తూ సీఎం కేసీఆర్ ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా కొన్నిచోట్ల చిరుజల్లులు, మరికొన్ని చోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆయిల్ పాం తోటలను పరిశీలించిన కలెక్టర్



గుండారంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కమాన్‌పూర్: కమాన్‌పూర్ మండలంలోని గుండారంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పాం తోటలను మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డితో కలిసి పరిశీలించారు. సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పరికరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆయిల్ పాం తోటల సాగు చేస్తే చాలా లాభాలు ఉంటాయని వివరించారు. ఒక్కసారి మొక్కలు నాటితే 30 ఏళ్ల వరకు పంట దిగుబడి వస్తుందన్నారు. తహసీల్దార్ దత్తు ప్రసాదరావు, సర్పంచ్ ఆకుల ఓదెలు, ఏవో ప్రమోద్‌కుమార్, ఏఈవోలు శ్రీనివాస్, సురేశ్ ఉన్నారు.

మద్దిర్యాలలో అదనపు కలెక్టర్ పర్యటన



నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

రామగుండం: అంతర్గాం మండలం మద్దిర్యాలలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ మంగళవారం పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, ఇంటింటా చెత్త సేకరణ, కంపోస్ట్ షెడ్ తడి, పొడి చెత్త నిర్వహణ, శ్మశానవాటికల స్థితిగతులు, వన నర్సరీలను పరిశీలించి కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు అంశాలపై సంబంధిత అధికారులను సున్నితంగా మందలించారు. సర్పంచ్ సందెల దివ్య, డీపీవో చంద్రమౌళి, ఫారెస్టు రిజర్వ్ ఆఫీసర్ నాగయ్య, ఎంపీడీఓ యాదగిరి, ఎంపీఓ మోతె సమ్మిరెడ్డి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ వ్రతం చేస్తున్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారం పరిధి ఊశన్నపల్లెలో టీటీడీ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో తరలివచ్చి పూజలు చేశారు. అర్చకులు అంబరీష్ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సర్పంచ్ కొనకటి మల్లారెడ్డి, ఎంపీటీసీ కదురు మానస, టీటీడీ ధర్మాచార్య నరెడ్ల సదానందం, ఆలయ కమిటీ చైర్మన్ బూడిద రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంటపల్లిలో బొడ్రాయి వేడుకలు



బొడ్రాయి ప్రతిష్ఠాపనలో మంత్రి ఈశ్వర్

ధర్మారం: మండలంలోని ఎర్రగుంటపల్లిలో మంగళవారం పోచమ్మ ఎలనంపుడు వేడుక నిర్వహించారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరై బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిర్వహించిన హోమంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ కొత్త లక్ష్మి, సింగిల్ విండో మాజీ చైర్మన్ పుస్కూరి నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

వానపోటు.. పంటలకు చేటు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది కాల్వశ్రీరాంపూర్ మెట్లపల్లి వద్ద మానేరు పరీవాహక ప్రాంతంలోని ఇసుక మేటలు వేసిన పంట పొలాలు. జిల్లాలో మూడు రోజులపాటు ఏకధాటిగా కురిసిన వర్షాలకుతోడు పైనుంచి గోదావరి, మానేరు నదుల నుంచి వచ్చిన వరదతో పంటపొలాలన్నీ ఇలా నీటమునిగాయి. చాలాచోట్ల ఇసుక మేట వేసింది. ఇలా జిల్లావ్యాప్తంగా రైతులు 4,970 ఎకరాల్లో వరిని 2900 మంది రైతులు, 847 ఎకరాల్లో పత్తి పంటను 406 మంది రైతులు నష్టపోయారు. ఇందులో రెండు వేల ఎకరాలకు పైగా భూముల్లో ఇసుకమేట వేసింది. పంటల నష్టం విలువ అంచనా వేస్తే రూ.12 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంటున్నారు.



ఈ చిత్రంలో గండిపడి కనిపిస్తున్నది ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామంలోని కొప్పురాని కుంట. దీనిని మరమ్మతు చేయాలని అన్నదాతలు అధికారులను సంప్రదించగా.. రైతులే సొంతడబ్బులతో బాగుచేసుకోవాలని సలహా ఇచ్చారని దీనికింద వంద ఎకరాల ఆయకట్టు సాగుచేసుకుంటున్న అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలతో జిల్లాలోని 1016 చెరువులు అలుగు పోస్తున్నాయి. అయితే ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మత్తడి దూకుతూ ప్రమాదకరంగా మారాయి. పలుచోట్ల ఇప్పటికే గండ్లుపడి నీరంతా ఖాళీ కావటంతో వాటికింద ఉన్న ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. తాత్కాలికంగా తెగిపోయిన చోట తక్షణ మరమ్మతు చేయించాలని అన్నదాతలు కోరుతున్నారు.



ఈ చిత్రంలో పూర్తిగా ధ్వంసమైనది ఆర్‌అండ్‌బీకి చెందిన సుల్తానాబాద్ నుంచి ర్యాకల్‌దేవ్‌పల్లిరోడ్డు. భారీ వర్షాలతో జిల్లాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అంతర్గత రోడ్లు బురదమయం అయ్యాయి. ఆర్‌అండ్‌బీ పరిధిలో దాదాపు 200కిలోమీటర్ల మేర 26 పనులను గుర్తించి మరమ్మతుకు రూ.1.30కోట్లు అవసరమని ప్రతిపాదించారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో 10 రోడ్లు దెబ్బతిన్నాయి. ఇందులో 8 బీటీ, రెండు మట్టిరోడ్లు ఉన్నాయి. వీటికి శాశ్వత మరమ్మతు చేయాలంటే రూ.5.31 కోట్లు, తాత్కాలిక మరమ్మతుకు రూ.19 లక్షలు అవసరం అవుతాయని అంచనా వేశారు. అలాగే మానేరు నదిపై ఓదెల మండలం రూపునారాయణపేట వద్ద, మంథని మండలంలో రూ.16కోట్ల చొప్పున వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యామ్‌లకు గండి పడింది. వాటిని తిరిగి నిర్మించాలంటే రూ.ఏడు కోట్లు అవసరం ఉంటాయని అంచనా వేశారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మంథని మండలంలోని పలు ప్రాంతాల్లో పడిపోయిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు. జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు విద్యుత్ శాఖకు నష్టాన్ని తెచ్చిపెట్టాయి. గోదావరి తీరంలో వరదలతో సుమారు 200 విద్యుత్ స్తంభాలు, 230 విద్యుత్ డీటీఆర్‌లు పాడయ్యాయి. మరో 60 ఇంకా నీటిలోనే ఉండిపోయాయి. మరమ్మతు చేయాలంటే రూ3.50 కోట్లు అవసరమని విద్యుత్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇవేకాకుండా రైతుల మోటార్లు, పైపులు కూడా ధ్వంసమయ్యాయి. అంతటా కరెంట్ పునరుద్ధరించినప్పటికీ వీటన్నింటినీ సరిచేయడానికి నెలరోజుల సమయం పడుతుందని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు.



సుల్తానాబాద్ మండలం శ్రీరాములపల్లిలో కోతకు గురైన రోడ్డు



ఈ చిత్రంలో కూలిపోయిన ఇంటి ముందు నిలుచున్నది ఓదెల మండలం కొమెర గ్రామానికి చెందిన నాగపురి కిట్టమ్మ. భారీ వర్షాలతో జిల్లాలో 124 ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఇందులో కిట్టమ్మది కూడా ఒకటి. తనకు సొంతగూడు కరువై కొడుకు ఇంట్లో ప్రస్తుతం దాలదాచుకుంటోంది. ఇల్లు కూలిపోవడంతో కాలుకు గాయమయ్యిందని, ప్రభుత్వం సాయంకోసం ఎదురుచూస్తోంది.

- భారీ వర్షాలతో రైతుల పరిస్థితి అధ్వానం
- వరదకు కొట్టుకుపోయిన పొలాలు
- సాగు భూముల్లో ఇసుకమేటలు
- కన్నీరుమున్నీరవుతున్న అన్నదాతలు
- రోడ్ల ధ్వంసంతో రాకపోకలకు అవస్థలు

సాక్షి, పెద్దపల్లి: వానమ్మ.. వానమ్మ ఒక్కసారైనా వచ్చిపోవమ్మా.. అంటూ పదిహేను రోజుల క్రితం పాడిన గొంతులు ఇప్పుడు వరద తెచ్చిన నష్టంతో మూగబోయాయి. నీటికోసం ఎదురుచూసిన కళ్లవెంట కన్నీరుకారుతోంది. కుండపోతగా కురిసిన వానలు, ఉగ్రరూపం దాల్చిన వరదలు తీవ్ర నష్టం కలిగించాయి. గోదారి, మానేరు, హుస్సేనిమియా వాగుల వెంబడి పంట పొలాలు నీటమునిగి, ఇసుక మేటలతో పొలాలను నింపింది. రహదారులు కోతకు గురై.. కొట్టుకుపోయి ధ్వంసమయ్యాయి. ఎడతెరిపిలేని వర్షాలకు ఇళ్లు కూలిపోయి, వరద నీరు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరింది. పైసాపైసా కూడబెట్టి సమకూర్చుకున్న సామగ్రి, వంటసరుకులు వరదపాలుకావటంతో ఆర్థికంగా నష్టపోయి కట్టుబట్టలతో విలవిల్లాడుతున్నారు. చెరువులకు మరమ్మతులు లేకపోవడంతో గండ్లు పడుతూ ఆయకట్టు అన్నదాతలకు కడగండ్లు మిగిల్చింది. వరదధాటికి విద్యుత్‌శాఖకు సైతం భారీగానే నష్టం వాటిల్లింది. ఇలా ఒక్కటేమిటి అన్ని రంగాల్లోని వారిని వరద ప్రభావితం చేసింది. ఎందరో జనజీవనాన్ని దుర్భరం చేసింది. గతేడాది వరదలతో నష్టపోయిన వాటికి పరిహారం అందలేదని, ప్రస్తుత వరదలకైనా తక్షణ నష్టపరిహారం చెల్లించాలని బాధితులు వేడుకుంటున్నారు.

నాణ్యత లేక.. వరదకు ఆగక..!



అడవిసోమన్‌పల్లి వద్ద కొట్టుకుపోయిన చెక్‌డ్యాం



వరదకు దెబ్బతిన్న పంట పొలాలు

- పూర్తికాకుండానే కొట్టుకుపోతున్న చెక్‌డ్యాంలు
- గతేడాది మూడు.. ఈయేడు రెండు నీటిపాలు
- చిన్నఓదాల వద్ద ఒకటి.. అడవిసోమన్‌పల్లి వద్ద మరొకటి
- జిల్లాలో రూ.265 కోట్లతో 21 చెక్‌డ్యాంలు

మంథని: నీటి వృథాను అరికట్టి.. ఎక్కడికక్కడ ఒడిసిపట్టి.. సాగునీటికి ఢోకా లేకుండా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మానేరు, బొక్కలవాగు, హుస్సేన్‌మియా వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలు అధికారుల ముందు చూపులేమి కారణంగా కొట్టుకుపోతున్నాయి. గతేడాది ఓదెల మండలం రూపునారాయణపేట, జమ్మికుంట మండలం విలాసాగర్ వద్ద చెక్‌డ్యాంలకు లీకేజీలు ఏర్పడ్డాయి. ఓదెల మండలం మడక–కొండపాక వద్ద కొట్టుకుపోయింది. తాజా వరదలకు మంథని మండలం చిన్నఓదాల, అడవిసోమన్‌పల్లి వద్ద చెక్‌డ్యాలకు గండిపడింది.

రూ.265 కోట్లు.. 21 చెక్‌డ్యామ్‌లు

మానేరు, హుస్సేన్‌మియా, బొక్కలవాగుపై జీవో నంబర్ 8 ఆధారంగా 19, డీఎంఎఫ్‌టీ నుంచి రెండు చెక్‌డ్యాంలు నిర్మించారు. ఇందులో రూ.246.89 కోట్లు 19 చెక్‌డ్యాంలకు, రూ.18.02 కోట్లు రెండు చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వం కాంట్రాక్టర్ల నుంచి ఒప్పందం చేసుకుంది. అగ్రిమెంట్ ప్రకారం పనులు తొమ్మిది నెలల్లోనే పూర్తి చేయాలి. మంథని మండలం గోపాల్‌పూర్ వద్ద చేపట్టిన చెక్‌డ్యాంను కేవలం మూడు మాసాల్లోనే ముగించాలి. కానీ.. సదరు కాంట్రాక్టర్ రెండేళ్లు దాటినా పనులు ఇంకా నత్తనడకన చేస్తున్నాడు. మంథని మండలంలో గోపాల్‌పూర్, చిన్నఓదాల, అడవిసోమన్‌పల్లిలో రూ.62.40 కోట్లతో మూడు చెక్‌డ్యాం పనులు చేపట్టారు. మూడూ చివరి దిశలోనే ఉన్నాయి. చిన్నఓదాల వద్ద చెక్‌డ్యాం గత వరదల్లోనే మట్టి కొట్టుకుపోయింది. బాడీవాల్, రిటర్నింగ్ వాల్ క్రాక్ వచ్చింది. అలాగే అడవిసోమన్‌పల్లి చెక్‌డ్యాం గ్రావెల్ కొట్టుకుపోయింది. రెండింటికి సుమారు రూ. కోటి మేరకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

వరద నష్టం అంచనాల్లో తప్పిదాలు

చెక్‌డ్యాంలను ఎగువ నుంచి వచ్చే వరదను అంచనా వేసి డిజైన్ చేయాలి. అంతేగాకుండా నీటి నిల్వ ప్రాంతాలు, ఎత్తు, సమీప పంటల మునక వంటి నిబంధనలు పరిగణనలోకి తీసుకోవాలి. అయితే అధికారులు డిజైన్లలో లోపాలు, అంచనాల్లో తప్పిదాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఐదున్నర లక్షల క్యూసెక్కుల వరద వస్తే తట్టుకునేలా చెక్‌డ్యాం డిజైన్ చేశామని, తొమ్మిది నుంచి 10లక్షల క్యూసెక్కుల వరద రావడం వల్లే పాక్షికంగా నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. అంచనాలకు మించి వరదరావడంతోనే నష్టం వాటిల్లినట్లు సమర్థించుకుంటున్నారు. అయితే అధికారుల అంచనాల్లో తప్పిదాలతోనే వరద పంట పొలాల్లోకి చేరి భారీ నష్టం వాటిల్లుతోందని రైతులు ఆరోపిస్తున్నారు.

మంచి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలి

- కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికీ పథకం
- మంత్రి కొప్పుల ఈశ్వర్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

ధర్మారం: సీఎం కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకం అందిందని, అలాంటి మంచి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని జక్కన్నపల్లిలో నేతకాని సంఘం భవన నిర్మాణానికి, ధర్మారంలో ముదిరాజ్ సంఘం భవనానికి మంత్రి భూమిపూజ చేశారు. బంజేరుపల్లితండాబి, కమ్మరికాన్‌పేట తండకే, నర్సింగపూర్, మల్లాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పత్తిపాకలో మాజీ ఉప సర్పంచు కల్లెం జలపతిరెడ్డి, నర్సింగపూర్‌లో కాంగ్రెస్ నాయకుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర పథకాలు దేశంలోనే నంబర్‌వన్‌గా మారాయన్నారు. కార్యక్రమంలో సర్పంచులు పుస్కూరి జితేందర్‌రావు, బద్దం సుజాత, సురకంటి శ్రీనివాస్‌రెడ్డి, గంధం వరలక్ష్మి, భూక్య చంద్రానాయక్, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజా, వైస్ ఎంపీపీ మెడవేని తిరుపతి, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు పుస్కూరి రామారావు, నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు 'డబుల్' ఇళ్లు అప్పగించాలి



నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు ఎంపికచేసిన లబ్ధిదారులకు పది రోజుల్లోగా అప్పగించాలని, లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చిలారపు పర్వతాలు, మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు రాజంమహంత అన్నారు. పెద్దపల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను పరిశీలించేందుకు మంగళవారం బయల్దేరిన నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. నాయకులు కొద్దిసేపు రాజీవ్ రహదారిపై బైఠాయించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇళ్లు ఇస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా పది ఇళ్లను కూడా ఇవ్వలేదని తెలిపారు. అధికార అహంకారంతో పోలీసులతో అడ్డుకోవడం అవివేకమేనన్నారు. నాయకులు సంపత్‌రావు, నాగరాజు, శ్రీనివాస్, సంపత్, రాజన్న, సంపత్‌రెడ్డి, శ్రీకాంత్, సతీష్, రమేశ్, రాకేశ్, వేణు, కార్తీక్, రాజేంద్రప్రసాద్, సంపత్, అంజీ, ప్రభాకర్, సదయ్య తదితరులున్నారు.

రైతులను ఆదుకోండి

- సీఎం కేసీఆర్‌కు డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ లేఖ



గోదావరిఖని: వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. బూడిద కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో జెన్‌కో బూడిద చెరువు కట్టకు గండిపడి మూడు డివిజన్లలోని రెండువేల ఇళ్లు నీట మునిగాయని, ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున పరిహారం అందించాలని, క్షేత్రస్థాయి సర్వేలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించేలా చూడాలని పేర్కొన్నారు. వర్షాలతో ప్రజలకు జరిగిన నష్టంపై కేబినెట్ మీటింగ్‌లో మాట్లాడకపోవడం సరికాదని, వరదల్లో మరణించిన వారికి కనీసం సంతాపం ప్రకటించలేదని, వరదప్రాంతాలను సందర్శించకుండా.. నష్టపోయిన రైతులను చులకన చేస్తూ మహారాష్ట్ర పర్యటనకు వెళ్లడం సరికాదని పేర్కొన్నారు. కుంభకోణాలకు పాల్పడి దేశాన్ని ఏలాలన్న కేసీఆర్ తీరును వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.

'కళ్ల కలక'పై ఆందోళన వద్దు



ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌ఓ

పెద్దపల్లిరూరల్: జిల్లాలో కళ్ల కలక వ్యాధి వ్యాప్తి చెందుతోందని, అయినా ఎవరూ కలవరపడొద్దని, ఇంటింటా ఫీవర్ సర్వేలో వారికి అవసరమైన యాంటీబయాటిక్స్ మందులు, ఐడ్రాప్స్ అందిస్తామని డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు 336 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 64,743 మందికి ఫీవర్ సర్వే నిర్వహించామన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులందరికీ హెల్త్ చెకప్ చేసి వారికి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 1,18,455.21 టన్నుల యూరియా ఉత్పత్తి



ఫెర్టిలైజర్‌సిటీ: ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో జూలైలో 1,18,455.21 టన్నుల యూరియా ఉత్పత్తి అయ్యిందని ప్రాజెక్టు సీజీఎం సుధీర్‌కుమార్ ఝా తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో వినియోగానికి తగినట్టు యూరియా ఉత్పత్తి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో రాష్ట్రానికి 44,345.88 టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 16,048.53 టన్నులు, కర్ణాటకకు 25,730.01 టన్నులు, మహారాష్ట్రకు 13,450.59 టన్నులు, ఛత్తీస్‌గఢ్‌కు 10,222.29 టన్నులు, తమిళనాడుకు 8,657.91 టన్నుల చొప్పున యూరియా సరఫరా చేశామని తెలిపారు.

క్లుప్తంగా

భూ సేకరణపై సమావేశం



అడిషనల్ కలెక్టర్‌తో సమావేశమైన ఆర్జీ-2 జీఎం మనోహర్

గోదావరిఖని: ఓసీపీ-3 విస్తరణపై అడిషనల్ కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్‌లాల్‌తో ఆర్జీ-2 జీఎం మనోహర్, ఇతర అధికారులు సమావేశమయ్యారు. పెద్దంపేటలో భూసేకరణపై చర్చించారు. ల్యాండ్ రికార్డ్ ఎం.శ్రీనివాస్, మంథని ఆర్డీవో హనుమ, ఇతర అధికారులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: గ్రూప్-3 పరీక్షలకు హాజరయ్యే మైనార్టీ అభ్యర్థులు ఈనెల 6లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మెహరాజ్ మహమ్మద్ కోరారు. పరీక్షకు హాజరయ్యే వారికోసం ఉచిత కోచింగ్ ఇచ్చేందుకే దరఖాస్తులను స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 98491 52516 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆయా పోస్టుకు..

జిల్లాలోని పలు మండలాల్లో గల భవిత, దివ్యాంగుల కేంద్రాల్లో ఆయాగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హతగల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఈనెల 4లోగా స్వీకరిస్తామని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. ఒకటి నుంచి 7వతరగతి వరకు చది, ఏడు సంవత్సరాల స్థానికత ఉండాలన్నారు. ఆయా కేంద్రాల్లో దరఖాస్తుదారుల పిల్లలు అడ్మిషన్ పొంది ఉండాలని పేర్కొన్నారు. అర్హతగల వారు ఈనెల 4లోగా దరఖాస్తులను మండల విద్యాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

గడువు పొడిగింపు

యూపీఎస్సీ, సీఎస్‌ఏటీ పరీక్ష శిక్షణకు మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 13 వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మెహరాజ్‌మహమ్మద్ తెలిపారు. మైనార్టీ స్టడీ సర్కిల్ పరిధిలో తొలిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 20న జిల్లాకేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో స్క్రీనింగ్‌టెస్ట్ నిర్వహిస్తారని, పూర్తి వివరాలకు 040-23236112 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వైద్యం కోసం వస్తూ .. అస్వస్థతకు గురై..



పుల్లం అక్కు మృతదేహం

పెద్దపల్లిరూరల్: బస్సులో ప్రయాణిస్తూ మార్గమధ్యలో అస్వస్థతకు గురైన పుల్లం అక్కు (62)ను పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా కొద్దిసేపటికే మరణించింది. అక్కు కుమారుడు సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా, మండలంలోని రాపల్లికి చెందిన పుల్లం అక్కు శరీరంపై ఏర్పడ్డ కురుపులకు చల్మెడ ఆనందరావు ఆసుపత్రిలో కొంతకాలంగా చికిత్స పొందుతోంది. మంగళవారం వైద్యసేవలకోసం ఆసిఫాబాద్ నుంచి కరీంనగర్ ఆసుపత్రికి బస్సులో బయల్దేరారు. మార్గమధ్యలో అస్వస్థతకు గురికావడంతో పెద్దపల్లి పట్టణంలో బస్సును ఆపగా, ట్రాఫిక్ కానిస్టేబుల్ శంకర్ సహకారంతో ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహిస్తుండగానే అక్కు కన్నుమూసింది.

వీఆర్‌ఏల క్రమబద్ధీకరణకు కసరత్తు

- 2011లో రిక్రూట్‌మెంట్ అయినవారు 98 మంది
- వారసత్వంతో ఉన్న వీఆర్‌ఏలు 400 మంది



సుల్తానాబాద్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ)వ్యవస్థను రద్దు చేస్తూ సీఎం కేసీఆర్ ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో జిల్లా అధికార యంత్రాంగం వీఆర్‌ఏలను నీటిపారుదల, పంచాయతీరాజ్, పురపాలక, వ్యవసాయ, వైద్య, విద్యాశాఖల్లోని వివిధ స్థానాల్లో భర్తీ చేసేలా కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం పనిచేస్తున్న వారు ఎంత మంది, అందులో ఏడు, పదో తరగతి ఆపైన చదివినవారు ఎంత మంది ఉన్నారనే వివరాలను జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సమాచారం సేకరిస్తున్నారు. 61 ఏళ్లు దాటినవారు ఉంటే వారి వారసులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగమివ్వాలని నిర్ణయించడంతో ఆ వయసు వారు ఎంత మంది ఉన్నారనే దానిపై సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాల్లో ప్రస్తుతం 498 మంది వీఆర్‌ఏలు పనిచేస్తున్నారు.

పక్షం రోజుల్లో పూర్తయ్యేలా..

క్రమబద్ధీకరణ ప్రక్రియను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో వీఆర్‌ఏల వివరాలు, ప్రభుత్వం ప్రతిపాదించిన శాఖల్లో ఖాళీలు ఎన్ని ఉన్నాయనే దానిపై అధికారులు సమాచారం సేకరిస్తున్నారు. ఆయా శాఖల్లో క్రమబద్ధీకరణ సమయంలో వీఆర్‌ఏ సంఘాలతోనూ చర్చించాలని అధికారులు నిర్ణయించారు. కారుణ్య నియామకం కింద వారి వారసులు సుమారు74 మందికి సైతం వారి విద్యార్హతలను బట్టి ఏ శాఖలో ఇవ్వాలనే దానిపైన కార్యాచరణ రూపొందిస్తున్నారు. క్రమబద్ధీకరణ ప్రక్రియను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని ఓ జిల్లా ఉన్నతాధికారి తెలిపారు.

వీఆర్‌ఏలదే కీలకపాత్ర

గ్రామాల్లో అధిక సమస్యలు పెండింగ్‌లో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. కులము, నివాసం, ఆదాయం, ఇతర సర్టిఫికెట్లకు, ప్రకృతి బీభత్సం వల్ల చెరువులు, కుంటలు, కెనాల్‌లు దెబ్బతింటే ఆయా గ్రామాల్లో వీఆర్‌ఏలే చూసుకోవాల్సి ఉంటుంది. లా అండ్ ఆర్డర్‌లో పోలీసులు మొదటగా పిలిచేది రెవెన్యూ సిబ్బందిని అందులో వీఆర్‌ఏలదే కీలకపాత్ర. గ్రామాల్లో ఏ అధికారి వచ్చినా పంచాయతీరాజ్, వ్యవసాయం, జనాభా, పశుగణన, ఇటీవల వ్యవసాయ బావుల సర్వే, భూముల సర్వే కు సైతం వీరే కీలకంగా వ్యవహరించారు.

డైరెక్టు రిక్రూట్‌మెంట్‌లో..

రాష్ట్ర ప్రభుత్వం 2011లో వీఆర్‌ఏల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పుడు జిల్లాలో అర్హతతోపాటు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు వీఆర్‌ఏలుగా 98 ఎంపికయ్యారు. ఉద్యోగంలో చేరితే త్వరగా పదోన్నతులు పొందవచ్చనే ఆలోచనతో డిగ్రీ, పీజీలు చేసినవారు వీఆర్‌ఏలుగా బాధ్యతలు స్వీకరించారు. తహసీల్ కార్యాలయాల్లో సిబ్బంది కొరత ఉన్నందున అధిక మంది వీఆర్‌ఏలు జూనియర్ సహాయకులుగా చేస్తూ కార్యాలయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు పనులు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

శుభ పరిణామం



వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం శుభ పరిణామం. వీఆర్‌ఏల ఐక్యతతోనే ఇది సాధ్యమైంది. వివిధ శాఖలకు కేటాయిస్తామని చెప్పారు. అందరికీ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికైతే రెవెన్యూ అధికారుల వద్దే పనిచేస్తున్నాం.

– వెంకటేశ్, వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వానికి ఉండగా నిలుస్తాం



61 ఏళ్లు దాటిన వీఆర్‌ఏల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది చాలా మందికి సంతోషకర విషయం. ప్రభుత్వానికి ఎల్లవేళలా ఉండగా నిలుస్తాం. వీఆర్‌ఏలలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉన్నారు.

– మహమ్మద్ రఫీ, వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు సుల్తానాబాద్

చలాన్ల పేరిట పోలీసులు వేధిస్తున్నారని..

- యువకుడి ఆత్మహత్యాయత్నం



యువకుడిని విచారిస్తున్న ఎస్సై శ్రీనివాస్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): చలాన్ల పేరిట పోలీసులు వేధిస్తున్నారని మండల కేంద్రానికి చెందిన వేముల రవీందర్ (26) మంగళవారం బస్టాండ్ ఆవరణలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్ మండల కేంద్రంలో వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తూ వ్యవసాయ పనులు చూసుకుంటున్నాడు. జూలై 30న బైక్‌పై పొలం పనులకు వెళ్లి వస్తుండగా హెల్మెట్ లేదని పోలీసులు రూ.135కు బదులు రూ.500 చలానా విధించారు. గత ఏప్రిల్‌లో సుమన్ అనే కానిస్టేబుల్ చలానాకు మించి ఎక్కువ ఫైన్ వేశారని వాపోయాడు. పోలీసులు సైతం హెల్మెట్ లేకుండా బైక్‌పై వెళ్తుండగా తాను సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టానని, పోలీసులకో న్యాయం తనకో న్యాయమా అని కామెంట్ పెడితే తనపై కక్ష పెంచుకున్నారని బాధితుడు తెలిపాడు. ఏఎస్సై రఘు సైతం ‘ఫిర్యాదును ఉన్నతాధికారులకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుపో’ అంటూ తనపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నాడు. ఈ విషయమై ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లగా ఏఎస్సై నీలిమ తన సెల్‌ఫోన్ తీసుకున్నారని, దీంతో మనస్తాపానికి గురై బస్టాండ్ చౌరస్తాలో పురుగుల మందు తాగేందుకు సిద్ధపడగా బైక్ పంక్చర్ కొట్టు వ్యక్తి తనను వారించి స్థానిక ఆసుపత్రిలో చేర్పించినట్లు బాధితుడు వివరించాడు. ఆత్మహత్యాయత్నం ఘటన సమాచారంతో ఎస్సై శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్లి రవీందర్‌ను విచారించాడు. కాగా బాధితుడిని చికిత్స కోసం పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈవిషయమై ఎస్సై శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. పోలీస్‌స్టేషన్‌లో రవీందర్ సెల్‌ఫోన్‌లో వాయిస్ రికార్డు చేస్తున్న విషయాన్ని గమనించిన పోలీసులు.. ఫోన్ చూపించాలని అతడిని కోరగా, అక్కడే ఫోన్ వదిలివేసి బస్టాండ్‌కు వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు.

జీడీకే-5 ఓసీపీపై నేడు హైకోర్టులో విచారణ

గోదావరిఖని(రామగుండం): జీడీకే-5 ఓసీపీపై డీజీఎంఎస్ విచారణ పూర్తి చేసి ఈనెల 16లోగా కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలని హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసినట్లు సీపీఐ నాయకులు మద్దెల దినేష్ తెలిపారు. ఓసీపీ బ్లాస్టింగ్ వల్ల దుమ్ముధూళి, పొగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రిట్ పిటిషన్ దాఖలు చేయగా.. విచారణ జరిపి కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. తమ తరపు న్యాయవాదులు ఇటీవల ఓసీపీ-5 కలుషిత నీటితో చెరువులో చేపలు మృతి చెందిన విషయాన్ని కూడా హైకోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. దీనిపై ప్రత్యేక పిటిషన్ దాఖలు చేస్తే స్వీకరిస్తామని కోర్టు కోరిందన్నారు.

మున్సిపల్ గదుల మరమ్మతుకు నిధులివ్వండి

మంథని: మంథని బస్టాండ్ ముందు మున్సిపాలిటీ నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ లీకేజీలతో దుకాణదారులు నష్టపోతున్నారని, మరమ్మతుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు కలెక్టర్ పంపిన వినతిలో పేర్కొన్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ వరద నీటి లీకేజీతో ఉరుస్తోందని, వస్తువులు, తినుబండారాలు తడిచి ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధురాలు మృతి



ఘటన స్థలంలో భూమమ్మ

మంథని: మంథని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ముత్యగారి భూమమ్మ(90) మంగళవారం లారీ ఢీకొని మృతిచెందినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఇసుక క్వారీ ర్యాంపు నిర్మాణానికి మట్టిని చేర్చి మంథని వైపు వెళ్తున్న లారీ, రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న భూమమ్మను ఢీకొట్టింది. రెండు కాళ్ల మీదుగా లారీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. మంథనిలో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ ధర్నా



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ ప్రతినిధులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కాంగ్రెస్ కార్పొరేటర్లు, పార్టీ ప్రతినిధులు నగరపాలక కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ రూ.వంద కోట్ల నిధులు సత్వరమే విడుదల చేయాలని, డివిజన్లలో నెలకొన్న పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రామగుండం ఎమ్మెల్యే అసమర్థత వల్ల కార్పొరేషన్ అభివృద్ధికి నోచుకోలేకపోతుందని, కేసీఆర్, కేటీఆర్‌లను కలిసి సెల్ఫీలకే పరిమితమవుతున్నారన్నారు. కార్పొరేషన్ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.వంద కోట్ల నిధులు మంజూరు చేయించాలని, లేకుంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, ఎస్సీ, బీసీ, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరదలో అండర్‌బ్రిడ్జి



ఓదెల: ఓదెలలోని రైల్వే అండర్ బ్రిడ్జి వర్షం నీటితో నిండింది. దీంతో ఓదెల నుంచి పొత్కపల్లి, కొమిర, గుంపుల, గూడెం వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం బైక్‌లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. లెవల్ క్రాసింగ్ గేట్ ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి లేదని, అండర్‌బ్రిడ్జి నిర్మాణాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

వస్త్రవ్యాపారంలో నష్టాలు

- మనస్తాపంతో వ్యాపారి ఆత్మహత్య



నరహరి (ఫైల్)

జగిత్యాలక్రైం: వస్త్రవ్యాపారంలో నష్టాలు రావడం, పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో మనస్తాపం చెందిన జగిత్యాల జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌కు చెందిన హోల్‌సేల్ వ్యాపారి గాజుల నరహరి(55) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నరహరి పట్టణంలో హోల్‌సేల్ వ్యాపారి. దందా బాగా సాగేందుకు బ్యాంక్‌లో కొంత రుణం తీసుకున్నాడు. తెలిసినవాళ్ల వద్ద మరికొంత అప్పు చేశాడు. అయితే, వ్యాపారంలో ఆశించిన లాభాలు రాకపోవడం, తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోవడం, వాటిని తీర్చే దారిలేకపోవడంతో ఆయన తీవ్రమనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఉదయం పట్టణంలోని జగిత్యాల క్లబ్‌కు వెళ్లాడు. ఇంటినుంచి తెచ్చుకున్న తాడును సీలింగ్ ఫ్యాన్‌కు కట్టి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులకు వడ్డీ కట్టలేక, ఆర్థిక ఇబ్బందులు వెంటాడడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని, తనను క్షమించండని రాసిన లేఖ మృతుడి జేబులో లభించింది. కాగా, క్లబ్ స్వీపర్ గదులు శుభ్రం చేస్తుండగా నరహరి సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో ఆయన కుటుంబసభ్యులతోపాటు, క్లబ్ సెక్రటరీ నారాయణరెడ్డికి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ నటేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సచిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య ఉంది. కూతురు అమెరికాలో ఉంటోంది. దీంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు జాప్యమయ్యే అవకాశం ఉంది.

బొగ్గుబాయి వార్తలు

వర్షాలతో ఆర్జీ-1లో తగ్గిన బొగ్గు ఉత్పత్తి

- జీఎం చింతల శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): భారీ వర్షాలతో ఆర్జీ-1 ఏరియాలో బొగ్గు ఉత్పత్తి గణనీయంగా తగ్గిందని జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని మీటింగ్‌హాల్‌లో మాట్లాడారు. జూలైలో 3.16లక్షల టన్నుల లక్ష్యానికి 2.65లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాల్లో 84 శాతం చేరుకున్నట్లు వివరించారు. ఈఏడాది ఇప్పటివరకు 14.13లక్షల టన్నుల లక్ష్యానికి 13.14లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి లక్ష్యాల్లో 93 శాతంలో నిలిచినట్లు పేర్కొన్నారు. జీడీకే-11 గనిలోని ఎల్‌హెచ్‌డీ విభాగంలో 103 శాతం ఉత్పత్తి సాధించినట్లు, జీడీకే-5 ఓసీపీలో 89శాతం బొగ్గు వెలికితీసినట్లు వివరించారు. పవర్ సెక్టార్ల నుంచి బొగ్గుకు డిమాండ్ పెరిగిందని, డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జీడీకే-11గనిలోని కంటిన్యూస్ మైనర్-1లో 1.60లక్షల టన్నుల బొగ్గు నిల్వలున్నాయని, స్టేబుల్ ఫిల్లర్ మెథడ్ ద్వారా బొగ్గు వెలికితీసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఆర్‌అండ్‌ఆర్‌ కేజీ ద్వారా సింగరెడ్డిపల్లెలో 83 ఇళ్లకు 40 ఖాళీ చేయించామని, మరో 19 త్వరలో ఖాళీ కానున్నాయని, ఇంకా 24ఇళ్లు ఖాళీ చేయాల్సి ఉందన్నారు. కొంత మందికి స్థానిక తిలక్‌నగర్‌లోని ఖాళీ క్వార్టర్లను గుర్తించామని వివరించారు. సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం రామ్మోహన్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఏజెంట్ బానోతు సైదులు, సివిల్ ఏజీఎం నవీన్, మధన్‌మోహన్, బాలసుబ్రహ్మణ్యం, వీరారెడ్డి, ఆంజనేయప్రసాద్, నరేన్‌చక్రవర్తి, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-3 డివిజన్‌లో 103 శాతం బొగ్గు ఉత్పత్తి



బొగ్గు ఉత్పత్తి వివరాలు తెలుపుతున్న జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ-3 డివిజన్‌లో గడిచిన జూలైలో 3.7 లక్షల టన్నులకు గాను 3.82 లక్షల టన్నులతో 103 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడం జరిగిందని జీఎం కె.సుధాకర్‌రావు తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఏపీఏ జీఎంతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఓసీపీ-1 నుంచి 118 శాతం, ఓసీపీ-2 నుంచి 80 శాతం ఉత్పత్తి చేసినట్లు వివరించారు. అధిక వర్షాలు కురిసినా ఉత్పత్తి సాధనకు కృషి చేసిన కార్మికులు, అధికారులకు జీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టులో సాంకేతిక లోపాలతో 29 శాతం మాత్రమే బొగ్గు ఉత్పత్తి జరిగిందని తెలిపారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారులు రాధాకృష్ణ, రాజేందర్, ఫైనాన్స్ ఏజీఎంపీ శ్రీనివాసులు, ఐఈడీ డీజీఎం కె.చంద్రశేఖర్, సివిల్ డీజీఎం పద్మరాజు. ఏరియా ఇన్‌చార్జి ఇంజినీరు శ్రీనివాస్, డీవైపీఎం రవీందర్‌రెడ్డి, మారుతి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలి



మాట్లాడుతున్న ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ-3 ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు, బొగ్గు రవాణాకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటూ ఆగస్టులో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జీఎం కె.సుధాకర్‌రావు అన్నారు. జీఎం కార్యాలయంలో మంగళవారం సంబంధిత అధికారులతో బొగ్గు ఉత్పత్తిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గడిచిన జూలైలో అధిక వర్షాలతో బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు, బొగ్గు రవాణాలో కొంత వరకు లక్ష్యం సాధించుకోలేపోయామని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఓసీపీల్లో నిలిచిన నీటిని పంపులతో బయటకు పంపించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. అధికారులు, కార్మికులు కలిసికట్టుగా రక్షణతో పని చేసి బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించుకోవాలన్నారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారులు రాధాకృష్ణ, రాజేందర్, ఐఈడీ డీజీఎం చంద్రశేఖర్, సీహెచ్‌పీ డీజీఎం కాశీవిశ్వేశ్వరరావు, ప్రాజెక్టు ఇంజినీరు శ్రీనివాస్, మేనేజర్లు ఉదయ్‌హరిజన్, రామరావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను మోసం చేస్తున్న యాజమాన్యం



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

- బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సత్తయ్య

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి వ్యాప్తంగా పని చేస్తున్న దాదాపు 30వేల మంది కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం మోసం చేస్తుందని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. మంగళవారం ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్ భవన్‌లో మాట్లాడారు. 2019 నుంచి కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వకుండా, వేతనాలు పెంచకుండా కాంట్రాక్టర్లు, యాజమాన్యం కాలయాపన చేస్తున్నారన్నారు. చట్ట ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యం వాటా కింద డబ్బులు కట్ చేయడం లేదని, దీంతో సీఎంపీఎఫ్ కమిషనర్ వాటిని స్వీకరించడం లేదని ఆరోపించారు. కార్మికుల వేతనాల నుంచి కట్ చేసిన డబ్బులు కంపెనీ ఖాతాలోనే ఉండిపోయాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు నాలుగేళ్ల నుంచి రావాల్సిన సీఎంపీఎఫ్‌తో పాటు పెన్షన్‌కు సంబంధించిన డబ్బులను వారి ఖాతాల్లో జమచేసి సీఎంపీఎఫ్ కార్యాలయానికి పంపాలని డిమాండ్ చేశారు. లేకుంటే సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట సీహెచ్ రమేష్, అనిల్‌కుమార్, సందీప్, శ్రీనివాస్, సత్తయ్య, శ్రీకాంత్, కుమార్, సమ్మయ్య, రమేష్, కిరణ్, శంకర్ తదితరులు ఉన్నారు.

ఆదాయ పన్ను ప్రభుత్వమే చెల్లించాలి

సింగరేణి కార్మికుల ఆదాయ పన్ను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ-1 ఏరియా జీడీకే-2వ గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు రావలసిన విద్యుత్తు బొగ్గు బకాయిలు రూ.25 వేల కోట్లు వెంటనే చెల్లించాలన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంస్థ పరంగా వచ్చిన వాస్తవ లాభాలపై 35 శాతం వాటా కార్మికులకు చెల్లించాలన్నారు. గేట్ మీటింగ్‌లో నాయకులు ఆకుల హరిణ్, మాదాసు రవీందర్, వెంకటస్వామి, తాట్ల లక్ష్మయ్య, జెల్ల తిరుపతి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన కార్మికుడికి సన్మానం



శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆర్జీ-2 ఏరియా వర్క్‌షాప్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా 38 ఏళ్లుగా సేవలందించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన నెన్నల శ్రీనివాస్-సరోజన దంపతులను కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో కాగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు తిరుపతి, చక్రపాణి, వీరారెడ్డి, తిరుపతిరెడ్డి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపులో కార్యకర్తలే కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: బీఆర్‌ఎస్ గెలుపులో కార్యకర్తలే కీలకమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. స్థానిక తిలక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పట్టణ బూత్‌లెవెల్ ప్రతినిధులు, కేబుల్‌టీవీ ఆపరేటర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిర్దిష్ట ప్రణాళిక, కార్యాచరణతో ముందుకు సాగినప్పుడే విజయం సాధ్యమన్నారు. సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయాలన్నారు. నియోజకవర్గంలో 29వేల ఆసరా పింఛన్లు, 9వేల మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, 14వేల మందికి రైతుబంధు, మూడు వందల మందికి రైతుబీమా అందించామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు పెంట రాజేష్, పాముకుంట్ల భాస్కర్, కొమ్ము వేణుగోపాల్, సాగంటి శంకర్, నాయకులు పాల్గొన్నారు.